క్లుప్తంగా

నేడు విజయోత్సవ సభ

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని సాయిమందిరంలో బుధవారం పర్తియాత్ర విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి సత్యసాయి వేద సమితి రాష్ట్ర కన్వీనర్ ఫణీంద్ర, సత్యసాయి సేవాసమితి జిల్లా కన్వీనర్ సాయి బాబలు హాజరవుతారని తెలిపారు.

తెరుచుకోని కళాశాలలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్‌: పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్ పాటిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఎక్కడా కళాశాలలు తెరుచుకోలేదు. కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చదివి విద్యార్థులు వెనుదిరిగారు. కళాశాలలు మూసి ఉండడంతో పీయూ అధికారులు మాత్రం తరగతులు నిర్వహించాలని యాజమాన్యాలకు సూచిస్తున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సాయం

జడ్చర్ల టౌన్‌: బాలానగర్ మండలంలోని తిరుమలగిరికి చెందిన సింగపోగు దివ్య నీట్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో మంగళవారం రూ.20వేల ఆర్థిక సాయం అందించినట్లు జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య తెలిపారు. దళిత కుటుంబానికి చెందిన దివ్య ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో అభినందించారు. కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు.

అయ్యప్పస్వాముల మహాపాదయాత్ర



జడ్చర్ల టౌన్‌: పట్టణానికి చెందిన 32మంది అయ్యప్పస్వాములు మంగళవారం శబరిమలకు మహాపాదయాత్రగా బయలుదేరారు. గంగాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించి సాయంత్రం పాదయాత్ర ప్రారంభించారు. మహాపాదయాత్రలో అయ్యప్పస్వాములు బాలు, అరవింద్, మురళి, రవి, ఆంజనేయులు, నాగరాజు, స్వాములు ఉన్నారు.

ముమ్మరంగా 'కురుమూర్తి' పనులు



చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆలయం వద్ద రంగులు అద్దే పనులతో పాటు పరిసరాలలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు తొలగిస్తున్నారు. స్వామి వారి ప్రధాన ఆలయ గోపురంతో పాటు మెట్లు, సైడ్‌వాలు తదితర వాటికి రంగులు వేయడం తుదిదశకు చేరకుంది.

రెడ్డిపల్లిలో టీబీ వైద్య శిబిరం



గండీడ్‌: మండలంలోని రెడ్డిపల్లిలో మంగళవారం టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రశేఖర్, ఆరిఫ్, డీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్ యాదమ్మ, హెల్త్ అసిస్టెంట్ గోపాల్, బాల్‌రాజు పాల్గొన్నారు.

నేటినుంచి పత్తి కొనుగోళ్లు

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. ఇక నుంచి ప్రతి బుధ, శనివారాలలో పత్తి క్రయవిక్రయాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మహబూబ్‌నగర్ క్రైం: అత్యాశపడి మోసపోరాదని, అవసరం లేని మెసేజ్‌లకు ఎవరూ రెస్పాండ్ కాకుండా ఉండాలని టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో మంగళవారం కారు డ్రైవర్లు, దుకాణదారులు, కస్టమర్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇటీవల నకిలీ పోలీస్ పేరుతో మోసాలు జరుగుతున్నాయని, ఆన్‌లైన్‌లో కేసుల పేరుతో మోసం చేయడానికి ప్రయత్నం చేస్తారని తెలిపారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని, సదరు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

నీటి సరఫరా సాఫీగా సాగేలా..

- పంచాయతీల్లో 527 మంది సహాయకుల ఎంపిక
- జిల్లాలో లక్షా 58 వేల నల్లా కనెక్షన్లు
- 1252 ఓవర్ హెడ్‌ట్యాంక్‌లు
- మిషన్ భగీరథ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగాల ఆధ్వర్యంలో నైపుణ్యశిక్షణ
- నేటితో శిక్షణ ముగింపు



గ్రామ మంచి నీటి సహాయకులకు ట్రైనర్లు ఇస్తున్న శిక్షణను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ ఎస్‌ఈ జగన్‌మోహన్, ఈఈ పుల్లారెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పల్లెల్లో మంచినీటి సరఫరా సజావుగా సాగేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నీతి ఆయోగ్‌లో భాగంగా జిల్లాలోని ప్రతి పంచాయతీకి ఒక కార్మికుడిని మంచి నీటి సహాయకుడిగా, పెద్ద పంచాయతీల్లో ఇద్దరిని తీసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 527 మంది సహాయకులను ఎంపిక చేసి వారికి మిషన్ భగీరథ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగాల ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. ఏ సమస్య వచ్చినా వారే పరిష్కరించేలా అవగాహన కల్పిస్తున్నారు.

రోజువారీగా ఒక్కో అంశంపై..

మిషన్ భగీరథ సరఫరాలో తరచు లీకేజీలు, పైపులైన్లలో సమస్యలు ఏర్పడుతుండడంతో ఏదో ఒక చోట అవాంతరాలు ఏర్పడుతున్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలంటే సాంకేతికత తెలిసిన వారిని పిలిపించుకోవాల్సి వస్తుంది. ట్యాంకుల నుంచి ఇళ్లకు నీటిని సరఫరా చేసే సహాయకులకు మరమ్మతులపై అవగాహన లేదు. సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వెంటనే పరిష్కారం కాక, సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీన్ని గుర్తించిన గ్రామీణ నీటి సరఫరా శాఖ సహాయకులకు అవగాహన కల్పించి, శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతి మండలంలోని అన్ని గ్రామాల సహాయకులకు నాలుగు రోజులు శిక్షణ ఇస్తున్నారు. రోజువారీగా ఒక్కో అంశాన్ని వివరిస్తూ, ఏం నేర్చుకున్నారో పరీక్ష కూడా నిర్వహిస్తున్నారు. నీటి నాణ్యత, చేతి పంపుల రిపేర్లు, పైప్ లైన్ల లీకేజీలు, ప్యానల్ బోర్డు రిపేరు ఈ నాలుగు అంశాలపై శిక్షణ పొందిన నలుగురు మాస్టర్ ట్రైనర్లు విడతల వారీగా శిక్షణ ఇస్తున్నారు.

పరిష్కారంపై అవగాహన..

ట్యాంకు నుంచి గేట్ వాలు ఇప్పే విధానం. నమూనాల సేకరణ, ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ చేసే విధానం, పైపులైన్ల నిర్వహణ, సింగిల్- త్రీ పేజ్ మోటార్ల వాడకం వంటి వాటిలో ముందుగా సమస్యలు గుర్తించి వాటిని ఎలా పరిష్కరించాలో వివరిస్తున్నారు. గ్రామాల్లో ఇంటింటికి సరఫరా అయ్యే పైపులైన్ల ద్వారా నీళ్లు ఎక్కువగా రావాలని స్థానికులు చర్రాలను తొలగిస్తున్నారు. వీటిని తొలగించడం వల్ల దుమ్ము, ధూళితో పాటు బ్యాక్టీరియా పైపులైన్ల ద్వారా నీటి వెంట వస్తాయి. చర్రాలు ఉంటే వడగడుతుంది. ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు. తాత్కాలిక పద్ధతిలో నియమితులైన ఈ సహాయకులకు నెలకు రూ.9,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. శిక్షణ ద్వారా సాంకేతిక మరమ్మతులు వారే చేసుకుంటే పంచాయతీల నుంచి అదనపు ఆదాయం పొందే అవకాశం కలగనుంది.

సజావుగా నీళ్ల సరఫరా కోసం..



సమస్యలను అధిగమించడమే లక్ష్యంగా, గ్రామాల్లో మంచినీటి సరఫరా చేయాలని ప్రభుత్వం సహాయకులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం చేపట్టింది. సహాయకులకు అవగాహన కల్పించి, ఇబ్బందులు ఎదురైతే మరమ్మతులు ఎలా చేపట్టాలో, సరఫరాలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. వారిని నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా ఈ శిక్షణ తీర్చిదిద్దనుంది.

– పుల్లారెడ్డి, ఈఈ మిషన్ భగీరథ

గత నెల 24 నుంచి ప్రారంభించిన ఈ శిక్షణ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది.

లక్షా 58 వేల నల్లా కనెక్షన్లు..

జిల్లాలో 14 మండలాలు, 441 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో లక్షా 58 వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. 1252 ఓవర్ హెడ్ ట్యాంక్‌లున్నాయి.

మహిళా సంఘాల పనితీరు భేష్

- కలెక్టర్ విజయేందిర బోయి



నవాబుపేటలో సీతాఫల్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం)/ నవాబుపేట: మహిళా సంఘాలు కొనసాగిస్తున్న సీతాఫలాల యూనిట్ చాలా బాగుందని, దాని ద్వారా మహిళలకు ఉపాధితో పాటు సంఘాలు ఆర్థికంగా ముందుకు పోతున్నాయని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మండల కేంద్రంలో మహిళా సంఘాల సీతాఫల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆమె పరిశీలించారు. మండలంలో ప్రభుత్వం ద్వారా ఒక్కో మహిళకు 50 కోళ్ల చొప్పున అందించి వారిని స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండలంలోని యన్మన్‌గండ్ల, లింగంపల్లి గ్రామాల్లో మహిళలకు అందించిన కోళ్ల యూనిట్‌లను ఆమె పరిశీలించారు. లింగంపల్లిలో జెడ్పీ పాఠశాలను పరిశీలించి అభివృద్ధి పనులపై ఆరాతీశారు.

పశువులకు టీకాలు వేయించాలి..

గాలికుంటు వ్యాధి వల్ల పశువుల్లో ఉత్పాదకత తగ్గిపోతుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేటలోని ప్రాథమిక పశువైద్యశాల కేంద్రంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రైతులు నష్ట నివారణ కోసం పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి ద్వారా ఈ సమాచారం రైతులకు అందేలా చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా పశుసంపదతో సమృద్ధిగా ఉండే ప్రాంతమని, గతంలో ఈ జిల్లా పాలమూరుగా కీర్తి పొంది, పాలు, పెరుగు ఉత్పత్తులతో రాష్ట్రంలోనే జిల్లా ముందు ఉండేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్‌గౌడ్, గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతయ్యయాదవ్, నవాబ్‌పేట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, ఏపీఓ జ్యోతి, తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్‌ను సందర్శించిన ఎమ్మెల్యే



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు: జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు పనితీరును మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బ్లడ్ బ్యాంక్‌లో ఉన్న వసతులు, సదుపాయాలు, రక్తం యూనిట్స్‌ను భద్రపరిచే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సమయాల్లో ప్లేట్‌లెట్స్ ఎలా సేకరిస్తారని, సేకరించిన వాటిని రోగులకు ఎంత సమయంలో అందిస్తారని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చేస్తున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, జగపతిరావు, డాక్టర్ శ్యామూల్, పెద్ద విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం చిరస్మరణీయుడు



జ్యోతిబాపూలె గురుకుల పాఠశాలలో కలాంకు నివాళులు



పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్కులు అందజేసిన సరోజనమ్మ

స్టేషన్ మహబూబ్‌నగర్: భారతదేశపు మిస్సైల్ మ్యాన్‌గా పేరొందిన భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సరోజనమ్మ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. న్యూటౌన్‌లోని కలాం విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం న్యూటౌన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్కులు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ఖాజాపాషా, మోసీన్, సుధాకర్‌రెడ్డి, అర్షద్‌అలీ, అంజద్ ఉన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో కలాం విగ్రహానికి వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పావని, కోట్ల శివకుమార్, రాఘవేందర్‌రావు ఉన్నారు.



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెంకట్‌రెడ్డి

జడ్చర్ల టౌన్‌: జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. సుకన్య అబ్దుల్ కలాం సేవలను గుర్తుచేశారు. పట్టణంలోని ఊర్కొండ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో వార్డు కౌన్సిలర్ సతీష్ ఆధ్వర్యంలో కలాం జయంతి నిర్వహించారు. కేక్‌కట్‌చేసి విద్యార్థినులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రవిప్రకాష్, వార్డు అధికారి కృష్ణయ్య, ఉపాధ్యాయ బృందం గీతామాధురి, అమిత, సంధ్య, అరుణ, సోని, పార్వతి, లావణ్య, నందని, రమాదేవి, ప్రియాంక, షహనాజిలు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



మిడ్జిల్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి



రుద్రారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

మిడ్జిల్: మండల కేంద్రంలోని సహకార సంఘం ద్వారా కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనువాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అల్వాల్‌రెడ్డి, కార్యదర్శి బాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గౌస్, సాయిలు, భీమయ్య, మల్లికార్జున్‌రెడ్డి ,శ్రీను నాయక్, బంగారు, సత్యం పాల్గొన్నారు.

ఏడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవాబుపేట: మండలంలో సహకార సంఘం ద్వారా గ్రామాల్లో ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు తెలిపారు. మంగళవారం మండలంలోని రుద్రారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్, సీఈఓ హన్మంతు, బంగ్ల రవీందర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్, శశిధర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభించకుండానే వెనుదిరిగిన కలెక్టర్

నవాబుపేట: మండలంలో లింగంపల్లిలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి వచ్చిన కలెక్టర్ విజయేందిరబోయి చివరిక్షణంలో ప్రారంభించకుండానే వెనుదిరిగారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు సమాధానం దాటవేశారు. ఎమ్మెల్యేకు సమాచారం లేకుండా మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించొద్దనే ఉద్దేశంతో కలెక్టర్ అర్ధాంతరంగా వెనుదిరిగినట్లు తెలిసింది.

మద్యం తాగిన వ్యక్తికి మూడు రోజుల జైలు

మహబూబ్‌నగర్ క్రైం: అధిక మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారుడికి న్యాయమూర్తి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారు. ఇటీవల దేవరకద్ర పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వాహనదారుడు మద్యం తాగి వాహనం నడుపుతుంటే పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుకున్నారు. పరీక్షల్లో సదరు వాహనదారుడికి 300శాతం వచ్చింది. దీంతో మంగళవారం ప్రత్యేక జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆర్.శశిధర్ వాహనదారుడికి రూ.2వేల జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో వాహనదారుడిని పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



మహమ్మదాబాద్‌: 108లో గర్భావతి ప్రసవించిన సంఘటన మహమ్మదాబాద్ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని జూలపల్లికి చెందిన శిరీషకు నొప్పులు రావడంతో 108కి ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది 108లో ఆస్పత్రికి తీసుకెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో నొప్పులు పెరిగాయి. ఈఆర్‌సీపీ డాక్టర్ సలహాతో ఈఎంటీ లక్ష్మీనారాయణ ఆమెకు 108లోనే కాన్పు చేశారు. దీంతో ఆమె పండంటి పాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిని గండీడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ తెలిపారు. వారితో పాటు పైలెట్ అక్బర్ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

భూత్పూర్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మున్సిపల్ పరిధిలోని నర్సింగాపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. నర్సింగాపూర్‌కు చెందిన అనుప కృష్ణయ్య ఈనెల 13న దాయాదులు కొందరు అసభ్యకర పదజాలంతో దూషించారని, వారిపై ఫిర్యాదు చేస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అనుప కృష్ణయ్య కుమారుడు అనుప లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నరాజమూర్ అంజన్నకు ఘనంగా పూజలు



దేవరకద్ర: చిన్న రాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అశ్వీయుజ శుద్ధ ద్వాదశి సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం



స్టేషన్ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది



నవాబుపేటలో శ్రమదానం చేస్తున్న యువకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం స్వచ్చత పక్వాడ కార్యక్రమం (శుభ్రత పక్షం) నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో మొక్కలు నాటడంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రైల్వే సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

నవాబుపేటలో శ్రమదానం..

నవాబుపేట: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఆధ్వర్యంలో యువకులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని రామచంద్రాపురంలో మురుగు కంపును, ఇండ్ల మధ్య చెత్తను తొలగించారు. ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేకే ట్రస్టు సుధాకర్, డాక్టర్ దీపిక, పుట్టి ఆంజనేయులు, నిరంజన్, పుట్టి కృష్ణయ్య, వెంకటయ్య, చందు, మల్లేష్, రమేష్, స్వామి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



తాటిపర్తిలో పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ శోభారాణి

భూత్పూర్: గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.మధుసూదన్ తెలిపారు. మంగళవారం భూత్పూర్, కొత్తమొల్గర, అన్నాసాగర్, తాటిపర్తి గ్రామాల్లో 60 ఆవులు, 273 గేదెలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు. మంగళవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో పశువులకు టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధ్యతాయుతంగా పనిచేస్తేనే గుర్తింపు



రాజాపూర్‌లో బదిలీపై వెళ్తున్న ఏడీని సన్మానిస్తున్న సిబ్బంది

రాజాపూర్: ఉద్యోగ నిర్వహణలో బదిలీలు సర్వసాధారణమని, తాము చేస్తున్న ఉద్యోగ బాధ్యతను సక్రమంగా నిర్వహించిప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని రాజాపూర్ డివిజన్ విద్యుత్‌శాఖ ఏడీ తౌర్యానాయక్ పేర్కొన్నారు. రాజాపూర్ డివిజన్ నుంచి మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళ్లిన ఆయనకు మంగళవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తనతో పాటు కలిసి పని చేసిన సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఏఈ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర/అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన వెల్టూర్ రాజేశ్వర్‌రెడ్డి అనారోగ్యం వల్ల హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేరారు. చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.లక్ష మంజూరు కావడంతో మంగళవారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో హేమవర్ధన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

- దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన ఆంజనేయులుగౌడ్ నిమ్స్ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత ఆపరేషన్ కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, రూ.1.75 లక్షల ఎల్‌ఓసీ మంజూరు కావడంతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పేదలకు అత్యవసర చికిత్స కోసం సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగ పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన ముడా చైర్మన్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇటీవల ముడా చైర్మన్‌గా నియమితులైన కె.లక్ష్మణ్‌యాదవ్ మంగళవారం డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. తనకు ఈ పదవి కట్టబెట్టినందుకు కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, పార్టీ నాయకుడు సంజీవ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల పాదయాత్ర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా నుంచి ఓయూ ఆర్ట్స్ కళాశాల వరకు తలపెట్టిన పాదయాత్రలో జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమ కారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ తెలిపారు. 15న ఆదిలాబాద్‌లో పాదయాత్ర ప్రారంభమై, 29న హైదరాబాద్‌లోని ఓయూ ఆర్ట్ కళాశాలలో ముగుస్తుందని తెలిపారు. రజక రిజర్వేషన్ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివన్న, జహీద్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా వ్యాప్తంగా జూలైలో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి ఆయా పాఠశాలలకు పంపించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కార్యాలయంలో డీఈఓ రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కొత్తగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు పాఠశాలల్లో చేరిన అనంతరం సీనియర్ ఉపాధ్యాయులను ఎలాంటి ఇబ్బంది లేకుండా పంపిస్తామని డీఈఓ చెప్పారు.